# పురుషులకు అమూల్యమైన ఉపదేశములు

## ఖుత్బా జుమా

19 మే 2017

సయ్యిద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్
అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్

# పురుషులకు అమూల్యమైన ఉపదేశములు

## ఖుత్బా జుమా

సయ్యిద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్
అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్

దిని: 19 మే 2017

ప్రచురణ

మజ్లిస్ అన్సారుల్లాహ్ ఖాదియాన్

జిల్లా : గుర్దాస్‌పూర్, పంజాబ్, భారత్

| | | |
|---|---|---|
| పుస్తకము పేరు | : | పురుషులకు అమూల్యమైన ఉపదేశములు |
| ప్రసంగీకులు | : | హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా |
| అనువాదము | : | హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ |
| ప్రథమ ముద్రణ (భారత్) | : | అక్టోబర్ 2017 |
| సంఖ్య | : | 500 |
| ముద్రణాలయము | : | ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్ |
| ప్రచురణకర్త | : | మన్సూబ బందీ కమిటి ఖాదియాన్ 143516, జిల్లా: గుర్దాస్‌పూర్, పంజాబ్, భారత్ |

---------------------

| | | |
|---|---|---|
| Name of the Book | : | Mardon ko ahem zarreen Nasaih (Friday Sermon 19 May 2017) |
| Delivered by | : | Hadhrat Khalifatul Masih v (aba) |
| Translated by | : | Hafiz Syed Rasool Niyaz |
| First Edition (India) | : | October 2017 |
| Quantity | : | 500 |
| Printed at | : | Fazl-e-Umar Printing Press Qadian |
| Published by | : | Mansooba Bandi Committee Qadian-143516- Dist:Gurdaspur, Punjab - India |

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అవతరించిన ఇస్లామీయ బోధన మనకు ప్రతి సమస్యలో మార్గదర్శనము చేయును. మనలోని ప్రతి ఒక్కరు ఈ బోధనను ఆచరించినచో ఒక చక్కటి సమాజము ఏర్పడవచ్చును.

ఒక పురుషునిగా తనపై గల విభిన్న బాధ్యతలన్నిటిని చెల్లించుటకు ప్రయత్నించవలెను. తద్వారా ప్రేమానురాగపు వాతావరణము ఎల్లప్పుడు నిలిచేలా తమ గృహములను ఆదర్శవంతముగా తీర్చి దిద్దుకో గలరు. ఒక పురుషుడు భర్తగా కూడ యుండును, తండ్రిగా కూడ యుండును. కుమారునిగా కూడ యుండును. కనుక ఈ విధముగా తమ బాధ్యతలను అర్థము చేసుకోవలెను. పురుషునికి ఇంకా అనేక స్థాయిలు గలవు. కాని కుటుంబ ప్రాథమిక ఐక్యత ఏర్పడుటకు ఈ మూడు స్థాయిలనే నేను వివరించాను. తద్వారా సమాజ శాంతికి ఇది ఆధారమగును. ఈ ప్రాథమిక స్థాయిలో శాంతి ఏర్పడినప్పుడు ఇందులో విస్తృత స్థాయిలో సౌందర్యము ఏర్పాటు చేయుటకు ప్రయత్నించవలెను.

(పవిత్ర ఖుర్ఆన్, ప్రవక్త హదీసులు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఉపదేశములు, ఆచరణ ఆధారముగా **చక్కటి శాంతియుత సమాజ నిర్మాణము కొరకు పురుషులు పోషించవలసిన పాత్ర** గురించి ముఖ్యమైన ఉపదేశములు)

19 హిజ్రత్ 1396 హిజ్రి షంసి అనగా 19 మే 2017వ తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మోర్డన్, లండన్, ఇంగ్లాండ్‌లో సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ప్రసంగించిన ఖుత్బా జుమా

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ
اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ -
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ - الرَّحْمٰنِ الرَّحِيْمِ - مٰلِكِ يَوْمِ الدِّيْنِ -
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ - اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ -
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ -

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అవతరించిన ఇస్లామీయ బోధన మనకు ప్రతి సమస్యలో మార్గదర్శనము చేయును. మనలోని ప్రతి ఒక్కరు ఈ బోధనను ఆచరించినచో ఒక చక్కటి సమాజము ఏర్పడవచ్చును. స్వచ్ఛమైన ఇస్లాం బోధనలను ముస్లింలు ఆచరించుచు ఆదర్శముగా నిలిచినచో నేడు ముస్లింలపై, ముస్లింల సాంప్రదాయముపై అభ్యంతరం వ్యక్త పరుస్తున్న ముస్లిమేతర ప్రపంచము వారి ఆదర్శనమును చూసి ఇస్లాం పట్ల ప్రభావితులయ్యే వారు. పవిత్ర ఖుర్ఆన్‌లో అనేక ఆజ్ఞలు గలవు. కాని అల్లాహ్ ఆలా వాటన్నిటిని ఒక చోట ఒక వాక్యములో ఇట్లని సమకూర్చెను. لَقَدْ كَانَ لَكُمْ فِيْ رَسُوْلِ اللّٰهِ اُسْوَةٌ حَسَنَةٌ (అల్ అహ్జాబ్:22) అనగా మీ కొరకు నిశ్చయముగా అల్లాహ్ ప్రవక్తలో ఒక మంచి ఉదాహరణ గలదు. కుటుంబము నుండి సమాజ సంబంధముల వరకు గల పవిత్ర ఖుర్ఆన్ సమస్త ఆదేశములను పాటించే విధముగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితము వ్యాపించి యుండెను. దురదృష్టవశాత్తు అధిక ముస్లింలు అల్లాహ్ తఆలా ఈ ఆదేశాన్ని కేవలం చదువుతూ, ఈ ఆదేశాన్ని గౌరవించుచు ఉంటారు కాని ఆచరణ విషయంలో మాత్రం వెనుకడు వేయుచున్నారు. ప్రతి విషయములో ఈ ఉదాహరణను పాటించినప్పుడే స్వచ్ఛమైన విజయము లభించును. కొన్ని సార్లు మానవుడు పెద్ద పెద్ద విషయములలో మంచి ఉదాహరణలను చూపుచుండును. కాని బాహ్య రూపంలో చిన్నగా కనిపించే కొన్ని

విషయములను అప్రధానమైనవిగా భావించుచు నిర్లక్ష్యము చేయును. కాని వాటికి భిన్నముగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహివసల్లం ఈ విషయాలను గూర్చి తమ ఉపదేశముల ద్వారా, ఉదాహరణల ద్వారా మనకు ప్రత్యేక శ్రద్ధను కలిగించిరి.

మనము మన జీవితములను శాంతియుతంగా మార్చుకోదలచి నచో, అల్లాహ్ తఆలా శుభములను పొందగోరినచో మన యజమాని, విధేయతార్హులైన హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి సమస్యలో మన ముందుంచిన, అనంతరం ఈ కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు వాటిని స్పష్టముగా మనకు తెలిపి, వాటిని ఆచరించాలని సూచించిన సత్ప్రవర్తనలను మనము మన జీవిత భాగములుగా చేసుకోవలసిన అవసరమున్నది.

పురుషుల వివిధ స్థాయిల వలన వారిపై గల బాధ్యతల గురించి నేనిప్పుడు కొన్ని విషయములు చెప్పదలచితిని. ఇంటి యజమానిగా కూడ పురుషుని బాధ్యత గలదు. భర్తగా కూడ పురుషునిపై బాధ్యత గలదు. ఒక తండ్రిగా కూడ పురుషునిపై బాధ్యత గలదు. కుమారునిగా కూడ పురుషునిపై బాధ్యత గలదు. ప్రతి పురుషుడు ఈ బాధ్యతలను అర్థము చేసుకొని వాటిని చెల్లించుటకు ప్రయత్నించినచో ఇదే సమాజము విస్తృత స్థాయిలో శాంతిని స్థాపించుటకు, సోదరభావమును స్థాపించుటకు మూలమగును. సంతాన సంస్కరణకు, శాంతి, మానవ హక్కులను స్థాపించు సంతానము వ్యాపించుటకు కూడ ఇవే కారణమై దోహదపడును. కుటుంబ సుఖఃశాంతులు వీటి ద్వారనే ఏర్పడును.

పురుషులు కుటుంబ యజమానులుగా, కుటుంబ పెద్దగా, సర్వధికారులున్న వారిగా తమను తాము భావించుకొంటూ, తమ భార్య హక్కులు చెల్లించకుండా, ఆమెకు ధర్మబద్ధమైన హక్కు చెల్లించకుండా, సంతాన సంస్కరణ హక్కును చెల్లించకుండా భర్తలు కేవలం నామమాత్రపు పెత్తనము చేయుచున్నారని నేడు చాలా గృహముల నుండి ఫిర్యాదులు కూడ అందుచున్నవి. కేవలం నామ

మాత్రపు యజమాన్యులు వీరు. భర్తలు భార్యలను కొట్టి కొట్టి శరీరముపై వాతలు పడేశారు లేదా గాయపరచినందున ముఖము వాచినదను ఫిర్యాదులు భారత్, పాకిస్తాన్ నుండి నేటికి కూడ వస్తున్నాయి. మరి కొందరు ఈ పశ్చిమ దేశాలలో నివాసముంటూ కూడ అలాగే ప్రవర్తించుచున్నారు. మరి కొందరు తండ్రులు దౌర్జన్యం చేయునట్లుగా వారి పిల్లలతో వ్యవహరిస్తారు. ఒకవేళ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించిన తరువాత కూడ మూర్ఖుల వలె యుండదలచినచో, ధార్మిక విజ్ఞానం లేని ముస్లిముల వలె యుండదలచినచో, మూర్ఖులు తమ భార్య పిల్లలతో వ్యవహరించునట్లు వ్యవహరించుచున్నచో, తమ స్థితులను మార్చుకుంటామని ప్రతిజ్ఞ చేసి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్‌లో చేరడం నిష్ప్రయోజనమగును.

పురుషులు అల్లాహ్ తాలా హక్కులను చెల్లించాలనే బాధ్యత కల్గియుండి, తమ ఆచరణాత్మక స్థితిగతుల ప్రామాణికమును వృద్ధి చేసుకొను బాధ్యత కల్గి యుండి వారు తమ బాధ్యతలను నెరవేర్చు చున్నారా? ఒకవేళ వారు ఆయా హక్కులను నెరవేర్చుచున్న వారైనచో ఇలా కుటుంబీకులపై దౌర్జన్యము చేసేవారు కాదు.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కుటుంబ యజమానిగా బాధ్యతలు చేపట్టుచూ మొట్ట మొదట దైవ ఏకత్వ స్థాపన ప్రాముఖ్యతను తమ భార్యా పిల్లలపై స్పష్టము చేసి దానిని ఆచరింపజేశారు. కాని ఈ పనిని కూడ బలవంతముగా కాక ప్రేమానురాగముతో చేయించారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక కుటుంబ పెద్దగా, ప్రపంచ సంస్కర్తగా, ధర్మ శాసన స్థాపన కార్యములలో నిమగ్నమై యుండి కూడ ఒక యజమానిగా తమ కుటుంబ సభ్యుల హక్కులు చెల్లించేవారు. అదికూడ ప్రేమానురాగము, మృదుత్వము, ఆప్యాయతతో ఈ హక్కు చెల్లించేవారు. దైవ ఏకత్వ స్థాపన, ఒక కుటుంబ యజమానిగా వారు సల్లల్లాహు అలైహి వసల్లం తమ కుటుంబ సభ్యులకు అల్లాహ్ తఆలా ఆరాధనే మీ ప్రథమ బాధ్యత అని అవగాహన కల్పించి వారి హక్కులను

నెరవేర్చిరి. హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్‌హా ఇట్లు తెలిపారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రి వేళలో నఫిల్ కొరకు నిద్రలేచేవారు. వేకువజామున నమాజ్ కంటే కొంచెం ముందు నఫిల్ చదవండి, ఆరాధించండి, అల్లాహ్ తఆలా హక్కు చెల్లించండని నీళ్ల చుక్కలు చల్లి మమ్ములను లేపేవారు.

*(బుఖారి కితాబుల్ వితర్, బాబ్ ఐఖాజున్నభియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం అహలహు బిల్ వితర్, హదీస్ 997, సున్ అబీదావూద్ కితాబిస్సలాతి బాబ్ ఖియాముల్లైల్ హదీస్ 1308)*

మరల వారు ఇంటి పనులు ఎలా చేసేవారో, స్త్రీల పనులలో ఏ విధముగా సహాయమందించేవారో వివరించుచు హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్‌హా ఇట్లు తెలిపిరి. వారు గృహములో ఉన్నత వరకు కుటుంబ సభ్యులకు సహాయమందించే వారు, వారికి సేవలు చేసేవారు. నమాజ్ కొరకు పిలుపు వచ్చు వరకు వారిలా చేసేవారు. ఆ తరువాత మస్జిద్‌నకు వెళ్ళి పోయేవారు.

*(సహి బుఖారి, కితాబుల్ అజాన్ బాబ్ మన్ కాన ఫీ హాజతి అహలిహి....హదీస్ సంఖ్య 676)*

ఈ ఆదర్శమును మనము అలవర్చుకోవలెను. మనము అనుసరించవలెను. అంతేగాని భార్యలపై దౌర్జన్యం చేయకూడదు.

హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్‌హా వారి కుటుంబ పనుల వివరాలను వివరించుచు ఇట్లు తెలిపిరి: వారు తమ దుస్తులను కూడ తామే కుట్టుకునేవారు. బూట్లు కుట్టుకునేవారు. గృహోపకరణాల ను మరమ్మతు చేసుకునేవారు.

*(ఉమ్దతుల్ ఖారి, షరహ్ సహీ బుఖారి, కితాబ్ మవాఖీతు స్వలాతి....హదీస్ 676, సంపుటి 5, పుట 298, ముద్రణ అహ్యావుత్తురాసుల్ అరబియ్యి బేరూత్)*

ఈ ఉదాహరణలు తమ ముందుంచుకొని భర్తలందరు తమ ఆత్మ పరిశీలన చేసుకోవలెను. అంతేగాకా వారి గృహములో పరిస్థితులు ఇలానే ఉన్నాయా? ఈ ప్రవర్తనలున్నాయా? ఆలోచించుకోవలెను.

ఒక సందర్భమున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరులకు భర్త బాధ్యతలను, వారి ప్రవర్తనలను గూర్చి తెలుపుచూ ఇట్లనిరి. దీనిని హజ్రత్ అబూహురైరా రజియల్లాహు తఆలా అన్హు ఉల్లేఖించిరి. మంచి ప్రవర్తనలు గల వ్యక్తే విశ్వాసులలో సంపూర్ణ విశ్వాసము గల వ్యక్తి. తమ భార్యలతో సత్ప్రవర్తనతో వ్యవహరించే వ్యక్తియే మీలో మంచి సద్గుణములు గలవాడగును.

*(సునన్ తిర్మజీ అబువాబు ర్రిజా, బాబ్ మా జాఆ ఫిల్ హఖ్ఖిల్ మర్అతి అలా జౌజిహా హదీస్ 1162)*

తన భార్య పట్ల ఉత్తమముగా ప్రవర్తించని ప్రతి వ్యక్తి స్వయముగా తమ ఆత్మ పరీశీలన చేసుకోవలెను. ఉన్నత సుగుణాలు, భార్యల పట్ల ఉత్తమముగా ప్రవర్తించడం వంటివి కేవలం ఉత్తమ లక్షణాలే గాకా విశ్వాస ప్రామాణికపు గొప్ప స్థాయికి చిహ్నమని కూడ వారు (స) తెలిపిరి.

భర్త బాధ్యతలు, భార్యలతో మంచిగా వ్యవహరించుట గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. స్త్రీల సిగ్గుమాలిన పనులు తప్ప మిగతా కఠినత్వములు, దుష్ప్రవర్తనలను భరించవలెను. పురుషుడై స్త్రీతో జగడమాడుటను అతి నీచమైన చర్యగా మేము భావిస్తాము. అల్లాహ్ తఆలా మనలను పురుషులుగా పుట్టించెను. వాస్తవానికి అతడు మనలను సంపూర్ణం చేసెను. అందుకు కృతజ్ఞత ఏమిటనగా మనము ఎంతో మృదువుగా, సున్నితముగా భార్యలతో వ్యవహరించవలెను.

ఒక సారి ఒక మిత్రుడు తన భార్య పట్ల చాలా దురుసుగా ప్రవర్తించుచు, కఠిన పదజాలము ఉపయోగించిన విషయమును తెలుపగా హుజూర్ అలైహిస్సలాం (ఎంతో బాధకు గురై) చాలా ఆగ్రహానికి లోనైరి. "మన సభ్యులు ఈ విధముగా ప్రవర్తించకూడద"ని హితవు పలికిరి. మరల లేఖకులిట్లు వ్రాసెను. ఆ తరువాత హుజూర్ అలైహిస్సలాం చాలా సమయం వరకు మహిళలతో ఏ విధముగా వ్యవహరించవలెననే అంశమును గూర్చి చర్చించిరి. చివరగా ఇట్లు

తెలిపిరి: "నా పరిస్థితి ఎట్లున్నదనగా ఒకసారి నేను నా భార్యను గట్టిగా మందలించితిని. (గట్టి ధ్వనితో మాట్లాడితిని) "ఆ పిలుపు హృదయ పూర్వక బాధతో కూడినట్లు నేను భావించితిని. (గట్టి ధ్వనితో మాట్లాడితిని. ఇందులో మనసులోని ఏదో బాధ గలదని భావించిరి) "కాని వాస్తవానికి మనసును బాధించు, కఠిన పదములేవి నోటి నుండి వెలువడలేదు". (దీనికి తోడు ఎలాంటి కఠిన పదము నోటితో అనలేదు) వారిట్లనిరి. అనంతరం నేను చాలా సమయము వరకు ఇస్తిఘ్ఫార్ చదివితిని. ఎంతో దుఃఖముతో నఫిల్ ప్రార్థనలు సలిపితిని. భార్యను ఇలా కోపగించు కోవడం ఏదో తెలియని పాపమునకు కారణము కావచ్చునని కొంత దానము కూడ ఇచ్చితిని."

*(మల్ఫూజాత్ సంపుటి 2, పుట 1-2, ముద్రణ 1985, ప్రచురణ ఇంగ్లాండ్)*

ఇది వారి ఉదాహరణ. మరొక మిత్రుడు కఠినముగా ప్రవర్తించినందున వారు ఎంతో కలత, బాధను వ్యక్తపర్చుచు ఇలా హితబోధ చేసిరి. "చిన్న చిన్న విషయముపై తమ భార్యలతో జగడమాడే, వారిపై చేతులెత్తి వారిని హింసించే వ్యక్తులు సిగ్గుపడవలెను." ఇక్కడ చేతులు ఎత్తడం సాధారణమైన విషయం. కాని నేను చెప్పినట్లు కొందరు ఏకముగా వారిని గాయపర్చుతారు. అలాంటి వారికిది చింతించవలసిన విషయము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశానుసారం అట్టివారి విశ్వాసం సంపూర్ణమైనది కూడ కాదు. అలాంటి వారు తమ విశ్వాసమును గూర్చి చింతించవలెను. విశ్వాసము సంపూర్ణముగా లేని వారు అనేక చోట్ల తప్పటడుగులు వేయవచ్చునని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశము వల్లనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆందోళన చెందిరి.

కావున బాహ్యరూపంలో చిన్నవిగా కనిపించినను అవి చిన్నవి కావని నేనింతకు ముందే చెప్పాను. ఈ దేశములలో సమస్యలు పోలీసుల వరకు చేరును, ఫలితముగా జమాఅత్‌కు చెడ్డపేరు వస్తుంది. కనుక అలాంటి వారు ప్రపంచ పరమైన శిక్షను కూడ అనుభవిస్తారు. పైగా అల్లాహ్ తాలా ఆగ్రహానికి కూడ గురవుతారు.

స్త్రీలో ఫలానా ఫలానా దుష్టత్వము యున్నందునే మేము కఠినముగా వ్యవహరించవలసి వస్తుందని కొందరు పురుషులందురు. అటులైనచో తాము ధార్మిక ప్రామాణికమునకు చేరినామా?లేదా? అని పురుషులు మొదట తమ ఆత్మ పరిశీలన చేసుకోవలెను. ఇటువంటి పురుషులకు ఉపదేశము చేయుచు హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. "పురుషుడు సత్యవంతుడు కానిచో స్త్రీ ఎలా పుణ్యవంతురాలగును." (మొదట పురుషుడు తస్యవంతుడైనచో అతని భార్య సత్యవంతురాలగునని ప్రథమ నియమము గలదుమిట్లనిరి. "నిస్సందేహముగా మొదట పురుషుడు సత్యవంతుడైనచో స్త్రీ కూడ పుణ్యస్తురాలగును." ఇట్లనిరి. "స్త్రీకి కేవలం మాటలతో ఉపదేశము చేయక ఆచరణతో ఉపదేశము చేసినచో దాని ప్రభావము ఉండును." మాటలతో మాత్రమే ఉపదేశము చేయకుము. ఆగ్రహించుకోవడం మాత్రమే సరికాదు. మీరు సత్కార్యులని, అడుగడగున అల్లాహ్ తఆలా ఆజ్ఞలను పాటించేవారని తమ ఆచరణతో నిరూపించుకోగలరు. ఆచరణతో పాటు చేసిన ఉపదేశము ప్రభావము చూపును. "మహిళలను అటుంచితే కేవలం మాటలతో మరొకరి మాట ఎవరు వింటారు" (ఆచరణ లేకుండా ఎవరు నమ్మరు) "ఒక వేళ పురుషుడు తమలో ఏదేని లోపమును కలిగి యున్నచో అందుకు అనుక్షణం స్త్రీయే సాక్షిగా నిలుచును." ఇట్లనిరి. "దేవునితో స్వయముగా భయపడని వ్యక్తితో భార్య ఎలా భయపడును ? ఇలాంటి మోల్వీల లేదా బర్త ఉపదేశము ప్రభావం చూపదు. అన్ని స్థితులలో ఆచరణతో కూడిన ఆదర్శమే ప్రభావం చూపును." ఇట్లనిరి. "పురుషుడు రాత్రి నిద్ర లేచి దుఆ చేయుచు, రోధించినప్పుడు స్త్రీ ఒకటి, రెండ్రోజులు చూసి ఆ తరువాత ఎదో ఒక రోజు ఆమె కూడ తప్పక ప్రభావితమగును." ఇట్లనిరి. "స్త్రీలో ప్రభావితమయ్యే లక్షణం అధికంగా యుండును" ...... వారిని చక్కదిద్దుటకు పాఠశాల ఏ మాత్రం సరిపోదు." ఇట్లనిరి. (స్త్రీలను సంస్కరించుటకు ఎటువంటి పాఠశాల అవసరం లేదు, ఎలాంటి సంస్థ కూడ అవసరం లేదు.) "భర్త ఆదర్శమే చాలా ఉపయోగపడును".

(సంస్కరించదలచినచో ముందుగా భర్తలు తమను తాము సంస్కరించుకోవలెను. తద్వారా వారు సంస్కరణ జరుగును.) వారిట్లనిరి. ........ "అల్లాహ్ తాలా స్త్రీ పురుషులను ఒకే ఉనికిగా నిర్ధారించెను. తమ లోపమును పట్టుకునేందుకు తమ స్త్రీలకు అవకాశమిచ్చుట పురుషుల తప్పిదము. నీవు ఫలానా పాపమునకు పాల్పడుచున్నావని స్త్రీలు అనేటట్లు వారికి అవకాశమివ్వకూడదు." (నీలో ఫలానా ఫలానా దుష్టత్వము గలదు, నీవు ఫలానా ఫలానా పాపములు చేయుచున్నావని స్త్రీ అనేటట్లు పురుషులు అవకాశమివ్వకూడదు. వారిట్లనిరి. పురుషుడు ఎంతగా పవిత్రుడై యుండాలనగా) "స్త్రీ ఎంత కష్టపడి వెతికినా ఆమెకు ఎటువంటి లోపము కనిపించనిచో ఆమెకు సన్మార్గ ఆలోచన కలిగి ఆమె ధర్మమును అర్థము చేసుకొనును."

*(మల్ఫూజాత్ సంపుటి 5, పుట 207-208, ముద్రణ 1985, ప్రచురణ ఇంగ్లాండ్)*

ఎంత అన్వేషించినా ఎలాంటి లోపము పురుషునిలో కనిపించని యెడల స్త్రీ ధార్మికురాలు కాకున్నను ఆమెకు ధర్మము పట్ల శ్రద్ధ కలుగును. కాని మహిళలు అధిక ధార్మికురాలలుగా యున్నట్లు నేనిక్కడి చూచితిని. మా భర్తకు ధర్మము వైపు ఆసిక్తి లేదని కొన్ని సందర్భాలలో వారు పిర్యాధు చేస్తుంటారు.

ఒక వైపు తమ బైఅత్ పరంపరలో చేరిన పురుషుల పట్ల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఇటువంటి ఆశయములు యుండగా, మరోవైపు పురుషులలో అధికులు నమాజులలో సోమరులుగా యున్నారని వారి స్త్రీలు వారిని గూర్చి ఫిర్యాదులు చేయడంను మనము చూస్తున్నాము. సామూహిక నమాజ్ అటుంచితే ఇంట్లో కూడ నమాజ్ చదువని వారు కూడ ఉన్నారు. ధార్మిక విద్య పురుషులకే అతి తక్కువగా యున్నది. చాలా మంది పురుషులు చందాలలో వెనుకబడి యున్నారు. టి.వి.లో అనవసర, వృథా కార్యక్రమాలను తిలకిస్తారని పురుషుల గురించి ఫిర్యాదులు వస్తున్నాయి. పిల్లల పట్ల శ్రద్ధ వహించరని అనేక పురుషుల గురించి ఫిర్యాదులు అందుచున్నాయి. వీరు తమను తాము కుటుంబ యజమానిగా నిరూపించుకోవడం కోసం లేదా

తండ్రిగా మెప్పు పొందడం కోసం కూడ తిట్టడం, కొట్టడం తప్ప మరేమి చేయరు. పురుషులతో స్త్రీలు నేర్చుకునే బదులు, అనేక గృహములలో పురుషులకు స్త్రీలు నేర్పుచున్నారు లేదా పిల్లలు చెడిపోకూడదని వారికి నేర్పించుచున్నారు. పిల్లలు సంస్కరణకు దూరమగుటకు కారణం పురుషుల అశ్రద్ధయే లేదా భార్యా పిల్లలపై అనవసరంగా కఠినత్వము ప్రదర్శించడం. మాతో లేదా మా తల్లితో మా తండ్రి వ్యవహారము సరిగా లేదని చాలా మంది పిల్లలు నాకు కూడ ఫిర్యాదు చేస్తుంటారు.

గృహములను శాంతియుతంగా మార్చదలచినచో, భావి తరాలను చక్కదిద్ద దలచినచో వారిని ధర్మముతో జోడించదలచినచో పురుషులు తమ స్థితుల వైపు దృష్టి సారించవలసిన అవసరము ఎంతైనా గలదు.

పురుషులకు శ్రద్ధ కల్పించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరల ఇట్లనిరి. "పురుషుడు తమ కుటుంబమునకు నాయకుడు. అతడే దుష్ప్రభావము వేసినచో ఇంకెంతగా దుష్ప్రభావము పడునో ఆలోచించవచ్చును." (అతని చర్యతో దుష్ప్రభావము పడుచున్నచో అనంతరం భావి తరాలపై కూడ దుష్ప్రభావము పడుచూ పోవును) "పురుషుడు సందర్భానుసారము తమ శక్తులను, సముచితమైన సమయములో వినియోగించవలెను. ఉదా॥ ఆగ్రహము." (కోపము) "కాని అది హద్దులు దాటినచో పిచ్చితనమునకు దారి తీయును." (కోపము స్వభాములోనే గలదు. ప్రతి మానవునిలో యుండును. కాని అది హద్దులు దాటినచో పిచ్చితనమునకు దారి తీయును. ఇట్లనిరి) "కోపానికి పిచ్చితనానికి మధ్య కొద్ది భేదమే గలదు. అతిగా కోపగించుకునే వ్యక్తి నుండి వివేకము గుంజుకోబడును. వ్యతిరేకునితో కూడ కోపముతో సంభాషించకూడదనే ఆదేశము గలదు." *(మల్ఫూజాత్ సంపుటి 5, పుట 208 ముద్రణ 1985, ప్రచురణ ఇంగ్లాండ్)* కుటుంబ సభ్యులతోనే కాక శత్రువులతో కూడ ఇలా కోపముతో సంభాషించరాదు. ఇంట్లో భార్యా, పిల్లలతో

కోపగించుకుంటు మాట్లాడరాదు. ఒకవేళ వ్యతిరేకి ఎదురుపడినను అతనితో కూడ కోపముతో, వివేకరహితముగా మాట్లాడకూడదు. శత్రువుల నిందలను ఖండిచుటకు కూడ కోపముతో అసభ్యకరమైన పదజాలముతో మాట్లాడకూడదు. ఇది ప్రామాణికము.

నేను ఇంతకు ముందు తెలిపినట్లు భారత దేశము, పాకిస్తాన్ నుండి మహిళలు తమ భర్తలు చేయు దౌర్జన్యములను గూర్చి వ్రాస్తుంటారు. రెండు చోట్ల అనగా ఖాదియాన్‌లోను, పాకిస్తాన్‌లోను నజారత్ ఇస్లాహ్ వ ఇర్షాద్, ఉపశాఖలు ఇటువైపు దృష్టి సారించవలెను. తమ సంస్కరణ కార్యక్రమాలను నిర్వహించుటకు ప్రపంచవ్యాప్తముగా కూడ అధిక శ్రద్ధ వహించవలెను. ప్రచారము చేయుచున్నారు, ధార్మిక విషయాలు నేర్చుకుంటున్నారు. కాని గృహాలలో అశాంతి, అభద్రత, అలజడులున్నచో, ఆ ధార్మిక విజ్ఞానం, ధార్మిక ప్రచారము ఎలాంటి లాభమును చేకూర్చదు.

మహిళల మనస్థత్వంను గూర్చి, వారు పురుషులను ఏ కోణంలో చూస్తుంటారో తెలుపుచూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి. "పురుషుని ఈ విషయుములు, లక్షణములన్నిటిని స్త్రీ అధ్యయనం చేయుచుండును. నా భర్తలో దైవభీతికి చెందిన ఫలాన, ఫలాన విశిష్టతలు గలవని ఆమె చూడును. ఉదా॥ దానగుణం, సహనం, ఓర్పు. పరీక్షించుటకు ఆమెకు (స్త్రీకి) లభించినంత అవకాశము మరెవరికి లభించదు." (ఇంట్లో ప్రతి రోజు చూచుచుండును) ఇట్లనిరి. "అందుకే స్త్రీని దొంగ అని కూడ అంటారు. ఎందుకనగా లోలోపల సద్గుణములను దొంగలించుచుండును. చివరికి ఒక రోజు సద్గుణములన్నిటిని పొందును." మరల ఇట్లు తెల్పిరి: "ఒక సారి ఒక వ్యక్తి (ఇస్లాంను వీడి) క్రైస్తవ ధర్మమును స్వీకరించెను. అతని భార్య కూడ అతనితో పాటు క్రైస్తవ ధర్మమును స్వీకరించినది. ముందుగా మధ్యం సేవించడం ప్రారంభించి, ఆ తరువాత ముసుగు ధరించడం కూడ వదిలి వేసినది. (ఆ మహిళ) ఇతరులతో కలవడం కూడ ప్రారంభించినది. కొన్ని రోజుల తరువాత భర్త మరల ఇస్లాంను

స్వీకరించెను." (అనగా నేను ఇస్లాంను వీడి తప్పు చేశానని భర్తకు కవ్వింపు కలిగి మరల ఇస్లాంలో చేరెను) "ఆ తరువాత అతడు తన భార్యకు నీవు కూడ మరల ఇస్లాంను స్వీకరించమని సలహా ఇచ్చెను. అందుకు అతని భార్య ఇప్పుడు నేను ఇస్లాంను స్వీకరించడం కష్టతరమని సమాధనమిచ్చినది. ఇప్పుడు పడిన అలవాట్లు, ఈ స్వాతంత్రమును, మధ్యపాన అలవాట్లను నేను వదులుకోలేనని కూడ తేల్చి చెప్పినది." (సేకరణ: మల్ఫూజాత్ సంపుటి 5, పుట 208-209 ఎడిషన్ 1985, ప్రచురణ ఇంగ్లాండ్) ఇది చాలా దురదృష్టకరమైన విషయము. ఒక వ్యక్తి ఇస్లాంను వీడి క్రైస్తవ ధర్మమును స్వీకరించెను, కాని ఎందరో పురుషులు ఇస్లాం ధర్మమును వీడకున్నను, పేరుకు ఇస్లాం ధర్మముతో అనుసంధానముగా ఉంటూ, తమను తాము ముస్లింలమని తెలుపుకుంటూ ఉంటారు, కాని స్వేచ్ఛ పేరుతో వారు కూడ ఎన్నో తప్పుడు పనులు చేస్తూ ఉంటారు. నేనింతకు ముందు తెలిపినట్లు స్త్రీలు ఇతరులను చూచి లేదా భర్తల మాటలు విని స్వేచ్ఛ పేరుతో అదే తప్పుడు వాతావరణమునకు అలవాటు పడిపోతారు. ఆ తరువాత కొన్ని రోజులకు భార్య అవసారానికి మించి స్వేచ్ఛగా తిరుగుతుందని పురుషులకు ఆలోచన వస్తుంది. ఆమెను అట్టి స్వేచ్ఛ నుండి బయటకు తీసుకరావటానికి ప్రయత్నించినచో తగాదములు ప్రారంభమగును. చివరికి ఈ దశలో కొట్టుకునే వరకు పరిస్థితులు వెళ్ళుతాయి. ఇక్కడ కూడ ఇలాంటి సంఘటణలే సంభవించుచున్నాయి. నేనింతకు ముందు తెలిపినట్లు ఈ దేశములలో వెంటనే పోలీసులు చేరుకుంటారు. మహిళల, బాలల హక్కుల సంరక్షణ సంస్థలు కూడ జోక్యం చేసుకుంటాయి. ఫలితముగా కుటుంబములు కూడ విచ్ఛిన్నమై పోతాయి. పిల్లలు కూడ నాశనమవుతారు. అందుకే కుటుంబములు విచ్ఛిన్నమై, పిల్లలు నాశనం కాక ముందు తమ భార్యా పిల్లల బాధ్యతల గురించి ధర్మము మోపుచున్న తమ బాధ్యతలను, ఇస్లాం నిర్ణయించిన వారి కర్తవ్యములను అట్టి భర్తలు గుర్తించాలి.

స్త్రీల హక్కులను, వారితో వ్యవహరించవలసిన విధానము

గురించి ఒక సందర్భమున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "స్త్రీల హక్కులను ఇస్లాం రక్షించిన విధముగా మరే ధర్మము రక్షించనే లేదు. క్లుప్తమైన అక్షరములలో وَلَهُنَّ مِثْلُ الَّذِي عَلَيْهِنَّ (అల్ బఖరా: 229) అనగా స్త్రీలపై పురుషుల హక్కులు యున్నట్లే పురుషులపై స్త్రీల (హక్కులు) గలవని చెప్పెను." ఇట్లనిరి. "కొందరి పరిస్థితి ఎంత దిగాజారి ఉంటుందనగా ఆ అమయకురాల్లను కాలు క్రింది చెప్పుల వలే చూస్తుంటారు, అతి నీచమైన వెట్టిచాకిరి కూడ వారితో చేయించుకుంటారు, దూషించుతారు, చిన్న చూపు చూస్తారు, వారికి ముసుగు ఆదేశమును అక్రమ పద్ధతిలో వ్యవహరించినందున వారిని ఒకరకంగా సజీవముగా సమాధి చేస్తారు." అనగా చేతులు, ముఖము ముసుగు గురించి ఎంత కఠినత్వమనగా స్త్రీకి శ్వాస తీసుకోవడం కూడ కష్టతరముగును. ఇలాంటి కఠినత్వము ఉండకూడదు. కాని ఇస్లాం ధర్మము ఎంతో బాధ్యతాయుతమైన ధర్మము. స్త్రీలు కూడ మధ్యేమార్గమును అవలంభించవలెను. ముసుగులో వెసులుబాటు పేరున అవసరాన్ని మించి స్వతంత్రము పొందకూడదు. కొందరు అవసరమును మించిన స్వేచ్ఛతో విహరిస్తుండడంను కూడ చూస్తునే ఉన్నాము. పేరుకే ముసుగు మిగిలినది. ఇది మంచిది కాదు. కావున లజ్జ ఆశయములను నెరవేర్చుచు కప్పుకోవలెను. అల్లాహ్ ఆదేశము ఇదే, కావున దీనిని గుర్తుంచుకోవలెను.

భార్యా భర్తల అనుబంధ ప్రామాణికము ఎలా యుండవలెను. ఈ విషయమును తెలుపుచూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెల్పిరి: "భార్యా భర్తల అనుబంధము ఇద్దరు స్వచ్ఛమైన మిత్రుల వలె ఉండవలెను. మానవుని గుణగణాల, దేవునితో గల అనుబంధమును గూర్చి మొదటగా సాక్ష్యమిచ్చువారు భార్యలే. ఒకవేళ వారితోనే వారి ప్రవర్తన సరిగా లేకున్నచో మరి వారు అల్లాహ్‌తో ఎలా సంధి కుదుర్చుకోగలరు." (గృహిణితోనే అనుబంధములు సరిగ్గా లేనప్పుడు, అల్లాహ్ తాలాతో సంధి ఏర్పడుట, అల్లాహ్ ఆదేశములను పాటించుట కష్టమే.) ఇట్లనిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం

ఇట్లు తెల్పిరి. خَيْرُكُمْ خَيْرُكُمْ لِاَهْلِهٖ తమ కుటుంబీకులతో ఉత్తమ రీతిలో వ్యవహరించువారే మీలో ఉత్తములు" *(మల్ఫూజాత్ సంపుటి 5, పుట 417-418) ఎడీషన్ 1985 (ప్రచురణ ఇంగ్లాండ్)* ఈ ప్రామాణికమును ప్రతి పురుషుడు అలవర్చుకోవలెను.

పురుషులు తండ్రిగా తమకు గల బాధ్యతను కూడ అర్థం చేసుకోవలెను. పిల్లలకు క్రమ శిక్షణ నేర్పడం కేవలం తల్లి బాధ్యతయేనని భావించకూడదు. నిస్సందేహముగా కొంత వయసుకు చేరు వరకు పిల్లలు వారి సమయమంత తల్లి వద్దనే గడుపుతారు. తల్లులు అతి పిన్న వయస్సు నుండి పిల్లలకు ఇచ్చే శిక్షణ వారి సంస్కరణలో కీలక పాత్ర పోషించును. కాని దీని వలన పురుషులు తమ బాధ్యతలను విస్మరించరాదు. తండ్రులు కూడ పిల్లల శిక్షణలో తమవంతు పాత్రను పోషించవలెను. ప్రత్యేకంగా పిల్లలు 7, 8 సంవత్సరముల వయసుకు చేరినప్పుడు వారు తండ్రుల నడవడిక మరియు వారి వ్యవహారము వైపు ఆకర్షితులవుతారు. అలా కానిచో ఈ పశ్చిమ దేశాలలో పిల్లలు త్వరగా తప్పు దారి పట్టే అవకాశాలు అధికముగా గలవు. మహిళలకు చెప్పిన పై విధానమునే ఇక్కడ కూడ అనుసరించవలసి యుండును. అనగా, తండ్రులకు, పురుషులకు వారి సంస్కారవంతమైన నడవడికను ఆదర్శముగా వారి పిల్లలకు చూపవలసి యుండును. తమ పిల్లలను సంస్కార వంతులుగా తీర్చిదిద్దుటకు తండ్రులు వారి పిల్లలను గౌరవించవలెను. అంతేగాకా చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి పరిసరాల దుష్ప్రభావములకు ప్రభావితులు కాకుండా ఉండుటకు పిల్లలపై గట్టి నిఘా కూడ ఉంచవలెను.

పిల్లలతో తండ్రులకు ఉండే అనుబంధము వలన పిల్లలలో ఒక విశ్వాసం, తమ సంరక్షణ పట్ల నమ్మకం ఏర్పడుతుంది. అనేక మంది తండ్రులు వారి పిల్లలలో భిడియం, అపనమ్మకం, అబద్ధము పలుకు అలవాట్లు చాలా తీవ్ర స్థాయిలో ఉన్నాయని నాకు విన్నవించు కుంటారు. అప్పుడు నేను వారితో మీరు మీ పిల్లలతో ఒక అనుబంధమును ఏర్పర్చుకొని, వారితో స్నేహ్నాముగా నడుచుకొనుమని

సూచించినచో, నెమ్మది నెమ్మదిగా వారి పిల్లలలో ఉన్న ఆ బలహీనతలు దూరమవుతూ వారిలో నమ్మకం పెరుగుతుండడంను మనము చూస్తుంటాము. పిల్లలను బయటి పరిసరాల ప్రభావం నుండి కాపాడుకొనుటకు తండ్రులు వారి పిల్లలతో కొంత సమయాన్ని బయటి వాతవరణంలో గడపవలెను.

తమ పిల్లలకు ధార్మిక శిక్షణ ఇప్పించడం కూడ తల్లిదండ్రుల బాధ్యతయే. పిల్లల శిక్షణ కోసం తండ్రులు ఉదాహరణగా నిలుస్తూ, వారి కోసం దుఆ కూడ తప్పక చేయవలెను. ఇది కూడ ముఖ్యమైనదే. శిక్షణల రుచికరమైన ఫలములు కేవలం అల్లాహ్ తాలా అనుగ్రహం వల్లనే లభించును. అయినను మానవుడు తన ప్రయత్నములను తాను తప్పకుండా చేయవలెను.

పిల్లలకు శిక్షణనిచ్చు విధానం, వారి కోసం దుఆ చేయుట వైపు మనకు శ్రద్ధ కల్పించుతూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెల్పిరి. "మార్గదర్శనము, నిజమైన శిక్షణ అల్లాహ్ తఆలా చేతిలో గలదు." (సత్యమార్గమును చూపుట అల్లాహ్ తాలా పనియే) "నిరంతరం నిఘా పెట్టుట, ఒకే పనిపై హద్దులు దాటి పట్టు బట్టుట, అనగా పిల్లలను అడ్డుకోవడం, తిట్టడం వంటివి చేయడం మనమే మార్గదర్శనమునకు యజమానులమని, మనమే మన ఇష్టానుసారము వారిని సన్మార్గముపై తీసుకరాగలమని భావిస్తున్నట్లుగా సూచించును. ఇది కూడ ఒక రకమైన అన్యారాధనయే. ఇలాంటి చర్యల నుండి మన జమాఅత్ వారు దూరముండవలెను." తమ నడవడికను గూర్చి తెలుపుచూ ఇట్లనిరి, "మేము మా పిల్లల కొరకు దుఆ చేస్తాము. సూచన ప్రాయంగా సూత్రములు, విద్యా ప్రమాణాలను పాటించుతాము." (మన బోధన ఏమిటి? మన సంస్కారము ఏమిటి?. (మనము పాటించవలసిన నిబంధనలు ఏమిటి? దీనిని పాటించుటకు సూచించుచుండుము.) "ఇంతకు మించి మరేమి ఒత్తిడి చేయము. అనంతరం అల్లాహ్ తఆలానే పూర్తిగా నమ్మెదము. ఎవరిలో సత్కార్య బీజము యుండునో వారు తగిన సమయములో సశ్యశ్యామలమగుదురు."

*(మల్ఫూజాత్ సంపుటి 2, పుట 5, ఎడిషన్ 1985. ముద్రణ ఇంగ్లాండ్)*

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మేము దుఆ చేయుదుమని తెలినప్పుడు, వారి దుఆల ప్రామాణికము మహోన్నతముగా ఉండుననే విషయమును మనము గుర్తుంచుకోవాలి. ఈ విషయమును తేలికగా తీసుకోరాదు. దుఆల ఈ ప్రామాణికమును పొందుటకు మనము ఎంతగానో కృషి చేయవలసి యుండును. ఇది ఏదో చిన్న విషయం కాదు. అందుకోసమే తండ్రులు అట్టి దుఆల వైపు అధికముగా శ్రద్ధ చూపవలెను.

ఒక తండ్రిగా తమ పిల్లల శిక్షణ విషయంలో ఏ విధముగా, ఎంతటి స్థాయిలో మనము శ్రద్ధ చూపించవలెననే విషయమును గూర్చి తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి. "తమ సంతానము కొరకు కొంత ధనము సంపాదించి పెట్టాలని కొందరు అభిప్రాయపడుదురు. ధనము సంపాదించాలనే ఆలోచన వారికి కలుగుచున్నది కాని, వారి సంతానము చెడు దారులను అనుసరించకుండా సన్మార్గమును అనుసరించాలనే ఆలోచన, కలత వారికి లేనందుకు నాకు ఆశ్చర్యము కలుగుచున్నది." (అనగా దుష్టులు, దుర్మార్గులు కాకూడదు) ఇలాంటి ఆలోచనలు వారికి ఎందుకు రావు?. ఈ విషయంలో వారికి చింతన ఎందుకు కల్గడం లేదో నాకర్థం కావడం లేదు. కొందరు తమ సంతానం కోసం కావలసినంత ధనమును సమకూర్చి పెట్టెదరు, కాని వారి పిల్లల సామర్థ్యమును మాత్రం పరిగణలోకి తీసుకోరు. వారు వారి జీవితము లోనే వారి పిల్లల వలన అవమానమునకు గురవుతుంటారు. వారి చెడు నడవడికల వలన కష్టాలలో చిక్కుకొందురు. వారు సంపాదించిన ఆ ధనము వారు ఏ విధముగా సంపాదించారో తెలియదు గాని వారి సంతానపు చెడు అలవాట్లకు, మద్యపాన సేవనంలో ఖర్చు చేయుదురు. అటువంటి తల్లిదండ్రులకు వారి సంతానము అరాచక, దుర్మార్గములో వారసులగును. సంతానము కూడ తల్లిదండ్రులకు ఒక పరీక్షయే అగును. ఒకవేళ సంతానం సన్మార్గములో నడుచునదైనచో వారికి

ఎలాంటి ఆందోళన కలుగదు. అల్లాహ్ తఆలా స్వయముగా ఇట్లనెను. وَهُوَ يَتَوَلَّى الصّٰلِحِيْنَ (అల్ ఆరాఫ్: 197) అతడు సజ్జనులకే సంరక్షకునిగా యుండును. దుష్టుడైనచో లక్షల రూ॥ అతని కొరకు విడిచినా పాపములలో నాశనం చేసి బిచ్చగాడగును. అతని కొరకు అనివార్యమైన ఇబ్బందులు, కష్టములలో అతడు పడిపోవును." మరల ఇట్లనిరి. "ఏ వ్యక్తి తన ఆలోచనలను అల్లాహ్ తఆలా ఆలోచనలకు అనుసారముగా, అతని ఆకాంక్షకనుగుణముగా మలుచుకొనునో అతడు తన సంతానం పట్ల నిశ్చింతగా యుండును. అతడు వారి సామార్థ్యముల కోసం ప్రయత్నించవలెను, దుఆ చేయవలెను. అప్పుడే అల్లాహ్ తఆలా వారిని సంరక్షించును." అతనికి చేయుతనిచ్చును, అతనిని సంరక్షించును. సామార్థ్యముల కోసం దుఆ చేయాలి అనగా వారి శిక్షణ కోసం చాలా శ్రద్ధ చూపవలసి యుండును. మరల ఇట్లు తెల్పిరి: "....హజ్రత్ దావూద్ అలైహిస్సలాం గారి ఒక వాక్యము గలదు, నేను బాలునిగా యుంటిని, ఆ తరువాత యువకుడనైతిని, ఆ తరువాత వృద్ధుడనైతిని. నేను ఏనాడు ఒక సత్పురుషున్ని అతనికి కావలసినంత సంపద లేకుండా చూడలేదు. వారి సంతానం భిక్షాటణ చేయుచుండగా కూడ చూడలేదు. అల్లాహ్ తఆలా ఎన్నో తరాల వరకు వారికి సంపదను అనుగ్రహించును. కావున నీవు కూడ స్వయముగా ఒక సత్పురుషుని వలె మార్పు చెందుము. నీ సంతానం కోసం దైవ భీతిలో, సత్కార్యములలో ఒక ఉదాహరణగా నిలువుము." (పిల్లల బాధ్యతలను నెరవేర్చుటకు కూడ తల్లిదండ్రులు ఇస్లాం బోధనల ప్రకారము తమ పరిస్థితులను మార్చుకోవలసిన అవసరముండును. అప్పుడే రాబోవు తరాల వారు సరైన మార్గములో నడుస్తారు. తల్లి దండ్రులకు ఆనంద దాయకముగా ఉండెదరు.) మరల ఇట్లు తెల్పిరి. "వారిని ధార్మికులుగా, దైవభీతి గలవారిగా తీర్చి దిద్దుటకు ప్రయత్నించుము, అందుకు దుఆలు చేయుము. వారి కోసం ధనమును సంపాదించుటకు మీరు ఎంతగా కృషి చేయుదురో, అంతే కృషిని మీరు వారు ధార్మికులుగా మారుటకు చేయుము." మరల ఇట్లు తెల్పిరి. "..... మీ సంతానం కోసం ఆదర్శప్రాయముగా నిలుచునట్టి, అభ్యాస

యోగ్యముగా నిలుచు కర్మలను చేసి చూపుము. అందుకోసం ముందుగా మీరు తమను తాము సంస్కరించుకోగలరు. ఒకవేళ మీరు ఉన్నత స్థాయి గల నిష్టాపరుడిగా, పరిత్యాగిగా మారినచో, అదే విధముగా అల్లాహ్ తఆలాను మెప్పొందించినచో అల్లాహ్ తాలా మీ సంతానం పట్ల కూడ ఉత్తమముగా వ్యవహరించునను నమ్మకమును ఏర్పర్చు కోవచ్చును." *(మల్ఫూజాత్, సంపుటి 8, పుట 108-110 ఎడీషన్ 1985 ముద్రణ ఇంగ్లాండ్)*

తమ పిల్లల శిక్షణ వైపు దృష్టి సారించుము, వారి కొరకు దుఆలు చేయుమని తండ్రికి ఇస్లాం ఆదేశమిచ్చినట్లే మీపై కూడ కొన్ని బాధ్యతలు గలవని ప్లిలలను కూడ ఆదేశించును. మీరు యవ్వన దశకు చేరినచో మీపై కూడ తల్లి దండ్రులకై నెరవేర్చవలసిన కొన్ని హక్కులు గలవు. వాటిని మీరు చెల్లించవలెను. బంధుత్వముల ఈ హక్కులను పరస్పరం జోడించినప్పుడే శాంతియుత సమాజము ఏర్పడును.

తల్లిదండ్రుల హక్కు చెల్లించుట ఎంత పెద్ద బాధ్యతో, దానికి ఎంతటి ప్రాముఖ్యత ఉండునో అను విషయము అందరికి తెలిసి యుండవలెను. ఒక బాలుడు యవ్వనమునకు చేరుకున్నప్పుడు తల్లిదండ్రుల హక్కులు ఎలా చెల్లించాలో తెలుపుచు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్హు ఇలా ఉల్లేఖించిరి. "నేను ధర్మ యుద్ధమునకు వెళ్ళదలచితినని ఒక వ్యక్తి ఆంహుజూర్ (స) సేవలో హాజరై వేడుకొనెను. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం నీ తల్లిదండ్రులు బ్రతికియున్నారా? అని అతడిని ప్రశ్నించిరి. అతడు బ్రతికే యున్నారని సమాధానం ఇచ్చెను. అందుకు హుజూర్ (స) వారిపురి సేవలు చేయుము. ఇదే నీ ధర్మయుద్ధమని బదులిచ్చిరి."

*(సహీ బుఖారి, కితాబుల్ జిహాద్ వస్సైర్, బాబుల్ బిఇజ్నిల్ అబవైని,* హదీస్ సంఖ్య 3004)

తల్లిదండ్రులకు చేయు సేవ ప్రాముఖ్యత ఈ విషయము ద్వారా తెలుస్తుంది. కేవలం ఇదియే కాదు, పరస్పరం ప్రేమానురాగాలను

పంచుకొనుటకు, తల్లి దండ్రుల స్నేహితులతో కూడ సత్ర్పవర్తనతో నడుచుకోవాలని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. కావున ఒక సందర్భములో వారు (స) ఇట్లు తెల్పిరి: మానవుని అత్యుత్తమమైన సత్కార్యమేమనగా తన తండ్రి స్నేహితులతో కూడ సత్ర్పవర్తనతో వ్యవహరించడం, అది కూడ వారి తండ్రి పరలోకమునకు వెళ్ళిన తరువాత.

*(సునన్ అబి దావూద్, కితాబుల్ అదబ్ బాబ్ ఫీ బిర్రుల్ వాలిదైని, హదీస్ 5143)*

మరొక సందర్భములో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విషయమునే విశదీకరించుతూ ఇట్లు తెల్పిరి. హజ్రత్ అబూ సయీదుల్ సఅది (ర) ఇట్లు ఉల్లేఖించిరి. మేమందరం నబీయే కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిదిలో కూర్చొని యుంటిమి. బనీ సల్మా తెగకు చెందిన ఒక వ్యక్తి అక్కడికి వచ్చి, ఓ రసూలుల్లా సల్లల్లాహు అలైహి వసల్లం తల్లి దండ్రుల మరణం తరువాత నేను వారి కొరకు చేయు ఏదేని సత్కార్యము గలదా? అని ప్రశ్నించగా, హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం హాఁ ఎందుకు లేదు, నీవు వారి కోసం దుఆ చేయుము. వారి కోసం క్షమాపణలను కోరుము. ఎవరితోనైన వారు ఏదేని వాగ్ధానం చేసినచో దానిని పూర్తి చేయుము. వారి బంధువులు, సన్నిహితులతో ఏ విధముగా వారు తమ జీవితంలో వ్యవహరించేవారో అంతే ఉత్తమముగా వారితో నీవు కూడ వ్యవహరించుము. వారి స్నేహితులతో గౌరవంగా, మర్యాధ పూర్వకముగా నడుచుకొనుము.

(సునన్ అబి దావూద్, కితాబుల్ అదబ్, బాబ్ ఫిల్ బిర్రుల్ వాలిదైని, హదీస్ 5142)

మరొక సందర్భములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు తెలిపిరి. ఎవరైన తమ వయస్సును పెంచుకోదలచినచో, వారి సంపదను వృద్ధి చేసుకోదలచినచో వారు వారి తల్లి దండ్రులతో గొప్పగా వ్యవహరించవలెను. ప్రేమానురాగాలను పంచవలెను.

(అల్ జామి లిషు'బిల్ ఈమాన్ సంపుటి 10, పుట 264-265 బాబ్ బిర్రుల్ వాలిదైని హదీస్ సంఖ్య 7471 మక్తబుర్రుష్ద్ నాషిరూనిర్రియాజ్ 2004)

పిల్లలు కేవలం గారాబం చేయడమే కాదు, వారు యవ్వన

దశకు చేరినప్పుడు వారిపై కొన్ని బాధ్యతలు గలవు. నెరవేర్చ వలసిన వారి తల్లి దండ్రుల హక్కులు కూడ వారిపై గలవు. వివాహం తరువాత ప్రత్యేకించి ఈ హక్కులను చెల్లించుటకు ప్రత్యేకమైన శ్రద్ధను చూపాలి. ఒకవేళ పురుషులు వారి భార్యల హక్కులు చెల్లించుచున్నచో, వారి తల్లి దండ్రుల హక్కులను చెల్లించుచున్నచో, వివేకముతో తన భార్యకు అత్త మామల హక్కులను గూర్చి అవగాహన కల్పించినచో తాను కూడ స్వయముగా తన అత్త మామల హక్కులను నెరవేర్చుచున్నచో కొన్ని సందర్భాలలో ఏర్పడే తగాదలు, గొడవలు ఏనాడు కూడ కలుగవు.

కొన్ని సందర్భాలలో ధార్మిక విభేధాల వలన తండ్రి కొడుకుల మధ్య చిన్న పాటి మనస్పర్ధతలు ఏర్పడును. కొందరు నూతన అహ్మదీయులు ఈ విషయంలో నేటికి ప్రశ్నిస్తునే ఉంటారు. ఇలాంటి పరిస్థితులలో కూడ పిల్లలు వారి తల్లి దండ్రులతో గౌరవంగా వ్యవహరించాలి, వారికి సేవలు చేయాలి. ఒక సారి బటాలాకు వెళ్ళుచున్న సమయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం షేక్ అబ్దుర్రహ్మాన్ గారిని వారి తండ్రి పరిస్థితిని గూర్చి తెలుసుకొని వారికి ఈ విధముగా ఉపదేశించిరి. “వారి కోసం దుఆ చేయుము” (వారు అహ్మదీయులు కారు, ముస్లిమేతరులు) అన్ని విధాలుగా, సాధ్యమైనంత వరకు తల్లి దండ్రల కోరికలను తీర్చవలెను. వారికి గతంలో కన్న అధికముగా ఉత్తమ నడవడికను చూపుతూ వారికి ఇస్లాం వైభవం వైపు వారి మనస్సు మళ్ళునట్లు నడుచుకొనుము. సుగుణాల మహిమ ఎంత ప్రభావితముగా యుండుననగా, దానికి సమానంగా మరే మహిమలు నిలువలేవు. స్వచ్ఛమైన ఇస్లాం ప్రామాణికము ఏమిటనగా, దాని ద్వారా మానవునిలో ఉన్నత లక్షణాలు జనించును. అతడు ఒక ప్రత్యేకత గల వ్యక్తిగా సిద్ధమగును. బహుశ అల్లాహ్ తఆలా నీ ద్వారా వారి హృదయములో ఇస్లాం పట్ల అభిమానమును పుట్టించవచ్చును. తల్లిదండ్రలకు సేవ చేయుటను ఇస్లాం అడ్డుకోవడం లేదు. ధార్మిక వ్యవహారంలో ప్రమేయం చూపని ప్రతి ప్రాపంచిక విషయంలో పూర్తి స్థాయిగా విధేయులు కావచ్చును. మనస్ఫూర్తిగా

వారికి సేవలు చేయుము." *(మల్ఫూజాత్ సంపుటి 4, పుట 175, ఎడిషన్ 1985. ముద్రణ ఇంగ్లాండ్)*

ఎల్లప్పుడు మృదు స్వభావంతో సంభాషించడం, ఉన్నత లక్షణాలను ప్రదర్శించడం కూడ ప్రచారముననొక సాధారణమైన నిబంధన.

ఇక్కడ మరొక సంఘటణ కూడ గలదు. తండ్రి కూడ ముస్లిమే. వారి ప్రశ్నకు విశ్లేషణాత్మకమైన సమాధానమిచ్చుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెల్పిరి. ఒక వ్యక్తి ఈ విధముగా ప్రశ్నించెను. ఓ హజ్రత్! తల్లి దండ్రులకు సేవ చేయడం, వారి పట్ల విధేయత చూపడంను మానవునిపై అల్లాహ్ తఆలా విధిగావించెను. కాని నా తల్లి దండ్రులు హుజూర్ గారి బైఅత్ పరంపరలో చేరడం వలన నా పట్ల తీరని ఆవేశమును ప్రదర్శించుచున్నారు. నా ముఖమును చూడుటకు కూడ వారు ఇష్టపడడం లేదు. కావున నేను హుజూర్ బైఅత్ చేయుటకు వస్తున్న సమయంలో వారు మమ్ములను ఉత్తర ప్రత్యురాలతో కూడ సంప్రదించకూడదని, ఇకపై నీ ముఖమును చూడదలచుకోలేదని కూడ తెలిపిరి. ఇలాంటి పరిస్థితులలో నేను అల్లాహ్ తఆలా ఆ ఆదేశమును ఏ విధముగా పూర్తి చేయగలను?. అందుకు హుజూర్ ఇలా సమాధానమిచ్చిరి. "పవిత్ర ఖుర్ఆన్ తల్లి దండ్రులకు సేవ చేయమని, వారి పట్ల విధేయత చూపమని ఆదేశించిన చోటనే ఈ విధముగా ఆదేశించెను. رَبُّكُمْ أَعْلَمُ بِمَا فِي نُفُوسِكُمْ إِنْ تَكُونُوا صَالِحِينَ فَإِنَّهُ كَانَ لِلْأَوَّابِينَ غَفُورًا (బనీ ఇస్రాయీల్: 26) అనగా, మీ హృదయాలలో ఉన్న దానిని అల్లాహ్ తఆలా స్పష్టముగా ఎరుగును. ఒకవేళ మీరు సత్యవంతులే అయినచో అతని వైపు మోకరిల్లు వారి కోసం అతడు క్షమాగుణుడు. సహాబలకు (అనుచర వర్గీయులకు) కూడ ఇటువంటి సమస్యయే ఎదురయ్యేను. ధార్మిక బేధముల వలన వారికి వారి తల్లి దండ్రుల మధ్య మనస్పర్ధలు ఏర్పడెను. మొత్తానికి నీవు వారి శ్రేయస్సు కొరకు, వారి క్షేమం కోసం ఎల్లప్పుడు సిద్ధముగా ఉండుము. అవకాశం దొరకినప్పుడల్లా దానిని జారవిడుచుకోకు. నీ సంకల్పమునకు తగిన ప్రతిఫలము నీకు దక్కి తీరుతుంది. ఒకవేళ కేవలం ధర్మము కోసం, అల్లాహ్ తాలా ప్రీతి

కోసం నీవు నీ తల్లి దండ్రులకు దూరముగా ఉన్నచో ఇదొక అనివార్య కారణము. సంస్కరణకు మొదటి ప్రాధాన్యతనివ్వుము. నీ సంకల్పమును సరి చూసుకో, వారి కోసం తప్పక దుఆ చేయుము. ఈ సమస్య నేడు క్రొత్తగా ఏమి ఏర్పడినది కాదు. హజ్రత్ ఇబ్రహీం అలైహిస్సలాంకు కూడ ఇలాంటి సమస్యయే ఎదురైనది. ఏది ఏమైనప్పటి దేవుని హక్కు చెల్లించుటకు మొదటి ప్రాధాన్యత నివ్వుము. దేవునికి మొదటి ప్రాధాన్యత నిచ్చుచు తల్లి దండ్రుల సేవకై ఎల్లప్పుడు సిద్ధముగా యుండుము. వారి కోసం దుఆ చేస్తూనే ఉండుము. నీ సంకల్పమును చెదరకుండా చూసుకొనుము." *(మల్ఫూజాత్ సంపుటి 10, పుట 130-131, ఎడిషన్ 1985. ముద్రణ ఇంగ్లాండ్)*

సంకల్పము గట్టిగా ఉండవలెను. నేడు కూడ అనేకులు మేము మా తల్లి దండ్రులకు ఏ విధముగా సేవ చేయగలమని ప్రశ్నిస్తూనే యుంటారు వారందరికి ఇదే సమాధానం ఇవ్వడం జరుగుతుంది.

మొత్తానికి ఒక పురుషునిగా తనపై గల విభిన్న బాధ్యతలన్నిటిని చెల్లించుటకు ప్రయత్నించవలెను. ప్రేమానురాగపు వాతావరణము ఎల్లప్పుడు నిలిచేలా తమ గృహములను ఆదర్శవంతముగా తీర్చిదిద్దుకో గలరు. ఒక పురుషుడు భర్తగా కూడ యుండును, తండ్రిగా కూడ యుండును. కుమారునిగా కూడ యుండును. కనుక ఈ విధముగా తమ బాధ్యతలను అర్థము చేసుకోవలెను. పురుషునికి ఇంకా అనేక స్థాయిలు గలవు. కాని కుటుంబ ప్రాథమిక ఐక్యత ఏర్పడుటకు ఈ మూడు స్థాయిలనే నేను వివరించాను. తద్వారా సమాజ శాంతికి ఇది ఆధారమగును. ఈ ప్రాథమిక స్థాయిలో శాంతి ఏర్పడినప్పుడు ఇందులో విస్తృత స్థాయిలో సౌందర్యము ఏర్పాటు చేయుటకు ప్రయత్నించవలెను. అల్లాహ్ తఆలా ఇందుకు మనందరిని అనుగ్రహించుగాక! (ఆమీన్).